# యుద్ధానం



## సలీం

**కథ**

విస్మిత కంగారు పడింది.

స్నానాల గదిలో కూనిరాగం తీస్తూ... అనాచ్ఛాదిత శరీరాన్ని ఆత్మీయంగా అల్లుకుంటున్న గోరువెచ్చటి నీటి స్పర్శని హాయిగా ఆస్వాదిస్తూ... నున్నటి ఒంటిమీద నురగలు కక్కుతోన్న పియర్స్ సోప్ పరిమళానికి తన్మయత్వం చెందుతూ... టక్కున ఓ చోట ఆగిపోయింది.

ఏంటది? ఏదో ఉండలా తగుల్తోంది. ఇంతకు ముందెన్నడూ అలా లేదే. మరోసారి తడిమి చూసింది. నిజమే. మెత్తగా, మృదువుగా ఉండాల్సిన చోట గట్టిగా... గుండ్రంగా... చొక్కా గుండీ అంత సైజులో...

మరలా అనుమానం... నిజంగానే ఉండలా తగిలిందా లేక తను ఏదో ఆలోచిస్తూ భ్రమకు లోనయిందా?

కుడిచేత్తో ఎడం రొమ్ముని మెల్లగా తడుముతూ, కళ్ళు మూసుకుని మనసుని స్పర్శ మీదే కేంద్రీకరించింది. అనుమానం లేదు... భ్రమ అంతకన్నా కాదు. గట్టిగా... రాయిలా తగుల్తోంది.

ఆమెకు ఒక్కసారిగా భయమేసింది. ఆలోచన ఆరు తలల పాములా ఆమెని చుట్టేసింది.

ఏమై ఉంటుంది? గడ్డనా?... ట్యూమరా... ఎలాంటిది... క్యాన్సరా... అదేనేమో. తప్పకుండా క్యాన్సరే అది. ఆమె వూహలు రెక్కలు విదిల్చి దిశాహీనంగా ఎగురుతున్నాయి.

ఇపుడేం చేయాలి? ఇంకా నయం. బాగా ముదిరాక గమనించలేదు. మొదటి దశలోనే గమనించబట్టి కొంతలో కొంత నయం. గుడ్డిలో మెల్ల... అంటే ఏమిటి? ఓ రొమ్ముని తొలగిస్తారా? ప్రాణం పోవటం కన్నా ఓ రొమ్ము పోవటం నయమనా అర్థం?

ఆమెకు మరో భయం పట్టుకుంది. ఇదే మొదలా లేక శరీరంలో ఎక్కడో ఉండి, బాగా ముదిరాక రొమ్ములోకి పాకిందా? ఏ అవయవంలో మొదలై ఉంటుంది? ఈమధ్య కాలంలో అనారోగ్యానికి ఏ అవయవం గురైంది? తను గుర్తించటంలో నిర్లక్ష్యం చేసిందా... ఇపుడు దాని శిక్ష అనుభవించబోతోంది.

అన్యమనస్కంగానే రెండు చెంబుల నీళ్ళు కుమ్మరించుకుని స్నానమయిందనిపించింది.

స్నానానికెళ్ళే ముందు అరవిరిసిన పువ్వులా ఉన్న ఆమె మొహం... స్నానం తర్వాత విచ్చుకున్న మందారంలా వెలిగిపోవాల్సిందిపోయి ఎందుకు ముడుచుకుపోయిందో ఆమె భర్తకు అర్థం కాలేదు.

"ఏవిటీ అదోలా ఉన్నావు?" అన్నాడు.

భర్తను ఇబ్బంది పెట్టటం ఇష్టంలేక "ఏం లేదండీ" అందామె నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఆమె మొహం తెల్లగా పాలిపోయి ఉండటం... కళ్ళల్లో నగ్నంగా కదలాడుతున్న భయం అతను గమనించాడు.

బాత్రూంలోకెళ్ళి భయంతో బైటికి రావడానికి గల అనేక అవకాశాల గురించి అతను ఆలోచించాడు. బల్లిని చూసి భయపడిందా... బొద్దింకను చూసి భయపడిందా... తమ కూతురి భవిష్యత్తు గురించి ఆలోచించిందా లేక తన ఉద్యోగ భద్రత విషయంలో భయపడిందా... యింతకుమించి అతని ఆలోచన సాగలేదు.

పెళ్ళయిన ఐదేళ్ళలో ఆమె అకారణ, అర్థరహిత భయాల్ని సానుభూతితో అర్థం చేసుకుంటున్నవాడు కాబట్టి ఆమెను అనునయంగా దగ్గరకు తీసుకుంటూ, "నీకో ఇంగ్లీష్ సూక్తి తెలుసు కదా... క్రాస్ ది బ్రిడ్జ్ వెన్ ఇట్ కమ్స్... వంతెన వచ్చాకే దాన్ని దాటాలి. కొన్ని మైళ్ళ దూరంలో వంతెన ఉందో లేదో తెలీకుండానే దాన్నెలా దాటాలా అని మథనపడే మనస్తత్వం మానుకో. నీ భయాలేమైనా ఉంటే నాతో పంచుకో" అన్నాడు.

"భయమా... అబ్బే అలాంటిదేం లేదండీ. కొద్దిగా వికారంగా అన్పిస్తేనూ... అంతే".

"వికారం అన్పించగానే లివర్ చెడిపోయి ఉంటుందనో, హెపటైటిస్-బి అనో భయపడి ఉంటావు. అంతేనా" అన్నాడు ఆటపట్టిస్తూ.

"మీకంతా వేళాకోళమే. వికారానికి అది కూడా కారణం కావొచ్చుగా. చిన్న పామునైనా పెద్ద కర్రతో చంపాలంటారు.

"నిజమే. కానీ నీ వూహలు వెర్రిగా సంచరిస్తాయి. అదే నా భయం... లివర్లో ఏదో చిన్న రుగ్మత అనుకుని ఆగిపోతే పర్లేదు. తమరు సిర్రోసిస్ దాకా వెళ్ళిపోతారు కదా".

"ఇపుడలా ఏమీ అనుకోవటం లేదులెండి. రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. అందుకై ఉంటుంది".


"హమ్మయ్య... బతికించావు తల్లీ. నా నెత్తిమీద పాలో, పెరుగో పోసినంత సంబరంగా ఉంది" హాయిగా నవ్వేస్తూ అన్నాడు.

తనకు నిజంగా క్యాన్సర్ అని తెలిస్తే వినయ్ ఏమైపోతాడు... తన మాటల్ని ఉత్త భయాలుగా కొట్టి పడేసినందుకు బాధపడ్తాడా... అప్పుడతని మొహం ఇలా కాంతిగా ఉండదేమో... దిగుల్తో నల్ల బడ్తుందా...

అతను ఆఫీసుకెళ్ళేవరకూ ఆలోచనల విషాన్ని గుటకలేసిన విస్మిత మూడేళ్ళ పాపని పక్కింట్లో అప్పజెప్పి తమ ఫ్యామిలీ డాక్టర్ దగ్గర కెళ్ళింది.

డాక్టర్ ప్రసన్నకు యాభైయేళ్ళ వయసుంటుంది. గత ఐదేళ్ళనుంచీ విస్మిత మనస్తత్వాన్ని ఆకళింపు చేసుకున్న అనుభవం... పెళ్ళయిన కొత్తలో వినయ్ తనూ కలిసి వచ్చారు. డెలివరీ కూడా తన చేతుల మీదుగానే జరిగింది.

విస్మిత చెప్పేదంతా ఆమె శ్రద్ధగా వింది. ఆమె భయాల గురించి బాగా తెల్సినదే అయినా డాక్టర్‌గా ఆమెని క్షుణ్ణంగా పరీక్షించింది.



చేతులు శుభ్రం చేసుకుని కన్సల్టింగ్ రూంకి తిరి గొచ్చాక విస్మిత వైపు నవ్వుతూ చూసింది. బూచి అనుకుని భయపడిన చంటిపిల్ల వైపు తల్లి చూసే వాత్సల్యం నిండిన చూపు...

"డాక్టర్! క్యాన్సరేకదూ"అంది విస్మిత. ఆమె కళ్ళనిండా మృత్యు భయం...

"ఛీ! తప్పమ్మా. అటువంటి భయంకరమైన రోగాలు మనకుంటాయనుకోకూడదు. నీకేమీ లేవమ్మా. నువ్వు ఆరోగ్యంగా ఉన్నావు".

"లేదు డాక్టర్! నాకు గడ్డలా తగిలింది. నిజం".

"అందుకే కదమ్మా నిన్ను పరీక్షించింది. ఏమీ లేదు".

"మీ పరీక్షకు అందనంత చిన్న గడ్డ ఉందేమో. నాకు గట్టి నమ్మకం. అది క్యాన్సర్. స్కానింగ్ చేయించటం మంచిదేమో".

డాక్టర్ ప్రసన్న ఆమె వైపు మారాంచేసే పిల్ల వైపు చూసినట్లు చూసింది.

"నేను డాక్టర్ని. నువ్వు నాకు ఐదేళ్ళ నుండి తెలుసు. నిన్ను నా కూతురనే అనుకుంటాను. ఏ కొద్ది అనుమానం ఉన్నా టెస్టులు నేనే రాస్తాను కదా. అసలు నాకో విషయం అర్థంకాదు విస్మితా. ఈ ఐదేళ్ళలో దాదాపు పదిసార్లు ఇదే భయంతో నా దగ్గరకు వచ్చి ఉంటావు. చిన్న రుగ్మత వచ్చినా అదేననుకుంటావు. ప్రతిసారీ నీది ఉత్త అనుమానమని రుజువైంది కదా".

"కాని ఈసారి మాత్రం నిజం డాక్టర్! మనం ముందుగా గుర్తిస్తే కనీసం బతికే అవకాశమైనా ఉంటుంది. ప్లీజ్ డాక్టర్! నన్ను నమ్మండి. మరోసారి పరీక్షించండి".

"అవసరం లేదమ్మా. నీ వయసంత అనుభవముంది నాకు. ఐనా దేవుడంత నిర్దయుడు కాదు తల్లీ. నీ వయసు వాళ్ళకు క్యాన్సర్ రావటం చాలా అరుదు. లేనిదాన్ని వూహించుకుని ఎందుకు నిన్ను నీవు హింసించుకుంటావు?"

విస్మిత సమాధానం చెప్పకుండా కొద్దిసేపు నేలచూపులు చూస్తూ కూచుంది. ఓ నిమిషం తర్వాత తలయెత్తి "ఓ పదిహేను రోజుల్లో దాని పరిమాణం పెరిగితే మరలా రమ్మంటారా" అని అడిగింది.

డాక్టర్ ప్రసన్న తన కుర్చీలో అసహనంగా కదిలింది.

"అలాంటి అవసరమే రాదు. నువ్వూహిస్తున్నట్లుగా జరగడానికి అవకాశమే లేదు. నన్ను నమ్ము. స్టాంప్ పేపర్ మీద రాసిమ్మంటావా? రాసిస్తాను. సరేనా... మంచి భర్త, ముద్దొచ్చే కూతురు... హాయిగా సంసారం చేసుకో. నీ భయాలన్నింటినీ ఈ గదిలో నాకొదిలేసి వెళ్ళు. నేను చూసుకుంటాను" అంది నవ్వుతూ.

విస్మిత అసంతృప్తిగా యింటికొచ్చింది. తన మాటని డాక్టర్ నమ్మనందుకు ఆమెకు చిరాగ్గా ఉంది. ఆ రోజంతా అసహనంగా గడిపింది.

రాత్రి నిద్దర్లో కల... స్నానంచేస్తూ గుండెల్ని రుద్దుకోబోతే మగవాడి ఛాతిలా చదునుగా ఉంది. కెవ్వున అరిచి లేచి కూచుంది. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. ఆలోచనలు... అవిశ్రాంతంగా... మెదళ్ళో ములుకుల్లా గుచ్చుకుంటూ...

సర్జరీ ద్వారా ఓ రొమ్ము తొలగిస్తే తను ఎలా కన్పిస్తుంది? ఆడతనంలో సగం మాత్రమే మిగిలినట్లు... అసంపూర్తిగా... వినయ్ ఎలా స్పందిస్తాడు? తను బాధపడకూడదని పైకి మామూలుగానే నటించినా తప్పకుండా అసంతృప్తికి లోనవుతాడు. ఆమెకు దుఃఖం వచ్చింది. కళ్ళెదురుగా ఎన్నెన్నో బొమ్మలు... కదలాడుతూ... తన భర్త మరో స్త్రీతో... సంపూర్ణమైన స్త్రీతో... ఆమెకు ఏడుపొచ్చింది.

ఆమెకు క్యాన్సర్‌తో చచ్చిపోయిన వాళ్ళమ్మ గుర్తొచ్చింది. స్క్వామిష్ సెల్ కార్సినోమా అప్పుడు తనకు పదిహేనేళ్ళు. అమ్మకు తరచూ జ్వరమొచ్చేది. వీపు నొప్పి, నడుం నొప్పి అంటూ ఏదో అనారోగ్యం చెప్తుంటే మామూలు రుగ్మతలనుకుని మందులు వాడారు తప్ప క్యాన్సర్ అని కనుక్కోలేకపోయారు.

చివరికది గొంతుక్కి పాకింది. అమ్మ అన్నం మింగలేకపోయేది. మాట పెగిలేది కాదు. సీసాల కొద్దీ గ్లూకోజ్ ఎక్కించేవారు. డబ్బులు మంచినీళ్ళ ప్రాయంలా ఖర్చు చేసినా ఉపయోగం లేకపోయింది. చివరిదశలో అమ్మ ఎముకల పోగులా మారింది. క్యాన్సర్ ఆమెని హింసించి హింసించి చంపింది. పగవాళ్ళకు కూడా అటువంటి చావు రాకూడదనుకున్నారందరూ.

అమ్మ చనిపోయి ఎన్నేళ్ళయినా జీవచ్ఛవంలా మారి బాధతో విలవిల్లాడుతూ చనిపోయిన ఆమె రూపం విస్మిత స్మృతి పథం నుంచి తొలగిపోలేదు. విస్మితని వెన్నంటి నీడలా ఆమెమరణ దృశ్యం... అనవరతం అశాంతికి గురిచేస్తూ... అప్పటినుండీ ఆమెకు మృత్యు వంటే భయం... క్యాన్సర్ అంటే మరింత భయం... వంశపారం పర్యంగా ఆ జబ్బు తనకూ వస్తుందన్న నమ్మకంతో కూడుకున్న భయం...

ఉదయం పనులన్నీ తొందరగా తెముల్చుకుని యింటికి దగ్గరగా ఉన్న కార్పొరేట్ హాస్పిటల్‌కెళ్ళింది. ఆమెని పరీక్షించిన లేడీ డాక్టర్ ఏమీ లేదంటూనే, "ఎందుకైనా మంచిది టెస్టులు రాసిస్తాను. చేయించుకుని రిపోర్టులు పట్రా" అంది. బ్లడ్ టెస్టులు, సిటి స్కాన్, మమ్మోగ్రఫీల్లాంటి రకరకాల టెస్టులు రాసిచ్చింది.

తను కోరుకున్నట్లు టెస్టులు రాసిచ్చినందుకు విస్మిత సంతోషపడింది. పట్టుచీర కొందామని ఎన్నాళ్ళనుంచో దాచుకుంటూ వస్తున్న డబ్బులన్నీ ఖర్చు చేసి పరీక్షలు చేయించుకొంది. డాక్టర్ వాటినన్నిటినీ పరిశీలించి "ఏంలేదమ్మా. నువ్వు ఆరోగ్యంగా ఉన్నావు" అనగానే విస్మితకు సంతోషానికి బదులు తన నమ్మకం వమ్మయినందుకు నిరాశ కలిగింది.

** ** **

పక్షం రోజుల్నుంచి విపరీతమైన తలనొప్పి...తల్లో మరయంత్రాలు బిగించినట్లు... రంపంతో మెదణ్ణి ముక్కలుగా కోస్తున్నట్లు...

మొదటి వారం రోజులు మామూలు తలనొప్పని సమాధానపడినా తర్వాతర్వాత ఆమెలో భయం చోటుచేసుకుంది. ఇది మామూలు తల

నొప్పికాదు. తల్లో ట్యూమర్ ఉంటేనే ఇలాంటి తలనొప్పి ఇంత తీవ్రంగా వస్తుంది. బ్రెయిన్ ట్యూమన్...

అలా అనుకున్న క్షణం నుంచి నొప్పి పెరిగిందే తప్ప కొద్దిగా కూడా ఉపశమనం లేదు. అమృతాంజన్లు, జండూబామ్‌లు అయ్యాక సారిడాన్లు, ఆస్ప్రిన్‌లు మింగిమింగి విసుగొచ్చి మానేసింది. మెదళ్ళో ట్యూమర్ ఉంటే ఇవన్నీ ఏం పనిచేస్తాయి తన పిచ్చిగాని... ఇంతకూ ట్యూమర్ బినైనా మాలిగ్నంటా? అది తెలియాలంటే బయాప్సీ చేయాల్సిందే అమ్మా... తనోసారి టివిలో చూసింది. మొదట గుండు చేస్తారు. తర్వాత విద్యుత్ రంపంతో కపాల భాగాన్ని కోస్తారు. ఆమెకు భయంతో వెన్ను జలదరించింది.

రెండ్రోజులక్రితం
ఎడం రొమ్ములో మరలా గడ్డలా
తగిలింది. ఎన్నిసార్లు తడిమి
చూసుకున్నా ఉండలా తగుల్తూనే ఉంది.
మరిచిపోయిన భయం మర్రివూడల్లా
మెదళ్ళోకి దిగిపోతూ...
క్యాన్సరేమోనన్న
అనుమానం.. బలపడి..
నమ్మకంగా మారి...

రెండ్రోజుల్నించీ మథనపడ్తోంది. డాక్టర్ దగ్గరకు వెళ్ళాలా వద్దా అని. అసలెందుకెళ్ళాలి? వెళ్లటంవల్ల ఒనగూడే ప్రయోజనం ఏముంది? శరీరాన్ని హింసకు గురి చేయటంతోపాటు డబ్బు కూడా నష్టపోవాలి. తనకున్నది క్యాన్సర్...డాక్టర్లేం చేయగలరు? మందులనీ, మాకులనీ, రేడియం ట్రీట్‌మెంటనీ, ఆపరేషన్ అనీ... ఎంత నరకం! పోయే ప్రాణం ఎలాగూ పోతుంది. ఉన్న కాసిని డబ్బులనైనా కాపాడుకోవటం మంచిది. తన కూతురికిపుడు పదేళ్ళు. ఐదో తరగతి చదువుతోంది. కుందనపు బొమ్మలా ఎంత ముద్దుగా ఉంటుందో... దాని చదువుకీ, పెళ్ళికి డబ్బు అవసరం కదా. ఈ డాక్టర్లచుట్టూ తిరిగి దివాలాతీసే బదులు కొద్దిగా ఉగ్గబట్టుకుంటే చాలు... అయినా ఎవరికోసమని... తన ఒక్కగానొక్క కూతురి కోసమేగా...

ఎన్ని రకాలుగా బుజ్జగించుకున్నా మనసులో భయం పీకుతూనే ఉంది. ఏమో...తన అదృష్టం బాగుండి బతకొచ్చుకదా. కనీసం నాలుగైదేళ్ళయినా చావుని వాయిదా వేయవచ్చు. తన కూతురి అచ్చటా ముచ్చట మరికొన్నేళ్ళు చూసుకోవచ్చు. తన భర్త అవసరాల్ని శ్రద్ధగా గమనించుకోవచ్చు.

డాక్టర్ ప్రసన్న దగ్గరకెళ్ళటానికి మనసొప్పటం లేదు. తనేం చెప్పినా తేలిగ్గా తీసుకుని నవ్వుతుంది తప్ప తన బాధని అర్థం చేసుకోదు. కాని కార్పొరేట్ ఆస్పత్రికెళ్ళాలంటే బోల్డు డబ్బులు కావాలి. గత్యంతరం లేని పరిస్థితి... ఆమె అయిష్టంగానే డాక్టర్ ప్రసన్నను కలుసుకుంది.

"హలో విస్మితా... ఎలా ఉన్నావు?" నవ్వుతూ పల్కరించింది డాక్టర్.

విస్మిత సమాధానం చెప్పలేదు.

"అంత డల్‌గా ఉన్నావెందుకు? ఆరోగ్యం బాగోలేదా? డోంట్ వర్రీ... మేమున్నది అందుకేగా... చెప్పు విషయమేమిటో" అందామె.

"తలనొప్పి డాక్టర్! తల పగిలిపోతోంది"

"ఇంకా"

"వాంతికొచ్చేట్టు అన్పిస్తోంది. తలమీద సుత్తితో బాదుతున్నట్లు...ఇరవై రోజుల్నించి ఇలానే ఉంది".

డాక్టర్ ప్రసన్న చల్లగా నవ్వింది. "సాధారణ రుగ్మత. అనవసరంగా బెంబేలు పడ్డావు. మైగ్రేన్ లక్షణాలు కన్పిస్తున్నాయి. నీ ఆలోచనల్తో అనవసరమైన భయాల్తో దాన్ని పెంచి పోషిస్తున్నావు. అంతే".



అందుకే నీ దగ్గరకు రాకూడదనుకున్నాను. పొరపాటు చేశాను. ఈసారి నీ దగ్గరకొస్తే అప్పుడు చెప్పు... అయినా రావడానికి అసలు నేనంటూ ఉంటే కదా... నా చావు కబురు తెల్సిన రోజైనా పశ్చాత్తాపపడు. నా ఆత్మయినా సంతోషిస్తుంది. అసలు నువ్వెలా డాక్టరయినావు తల్లీ మా ప్రాణాలు తీయడానికి? డాక్టర్ పట్టాని కొనుక్కున్నావా...

"మందులు రాసిస్తున్నాను. వాడి చూడు. తప్పకుండా రిలీఫ్ కన్పిస్తుంది.

తొందరగా రాసివ్వు తల్లీ. ఇక్కడినుండి బైటపడటమే పెద్ద రిలీఫ్ నాకు అనుకుంది విస్మిత. వెంటనే ఆమెకో విషయం గుర్తొచ్చింది. తను ఫీజిస్తుంది కదా. అలాంటప్పుడు ఆమె ఏం రాసిస్తే అది దూడూ బసవన్నలా ఎందుకు తీసుకోవాలి? తనో కన్జూమర్...తనిస్తున్న డబ్బుకి ప్రతిఫలం పొందకుండా కదలదు.

"నా బ్రెయిన్‌లో ట్యూమర్ ఉందేమోననిపిస్తోంది డాక్టర్" అంది.

మందులు రాస్తున్న ప్రసన్న తలయెత్తి చూసి మరలా నవ్వింది."అదే అనుకుంటూ ఆశ్చర్యపోతున్నా ఇందాకట్నుంచి... నాకు తెల్సిన విస్మిత కాదే... ఒక్క మాటైనా మాట్లాడకుండా నేను చెప్పినదానికి తలవూపిందే అనుకుంటున్నా. ఇప్పుడు తృప్తిగా ఉంది. నువ్వు ఎప్పటి విస్మితవే. మారలేదు".

"మామూలు తలనొప్పి ఇలా ఉండదు డాక్టర్... ఇది ట్యూమర్ వల్ల వచ్చిందే. లోపలేదో బండరాయి పెట్టినట్లు పోట్లు".

"నువ్వు క్యాన్సర్ భయాన్ని వదలవా?" పెన్నుకి మూతపెట్టి సూటిగా విస్మిత వైపు చూసింది. "నీకో విషయం చెప్పాలనుకుంటున్నాను. మనసు చాలా శక్తివంతమైంది. అది శరీరాన్ని నియంత్రిస్తూ ఉంటుంది. నువ్వోపని చేయగలవని బలంగా నమ్మితే చేయగలవు. నీకు చాత కాదనుకుంటే నిజంగానే చాతకాదు. అంతా మనసు ఆడే ఆట. యద్భావం తద్భవతి అంటారు వినలేదా? నువ్వేదనుకుంటావో అదే నిజమని మనల్ని నమ్మిస్తుంది మన మనసు. తాడుని పామనుకుంటే అది పాములా కదుల్తున్నట్లు... దానికో పడగున్నట్లు... చివరికది బుసకొడ్తున్నట్లు కూడా అన్పిస్తుంది. ఆ భయంతో గుండె ఆగినా ఆగిపోవచ్చు.మనకేదో రోగముందనుకుని బలంగానమ్మితే తప్పకుండా మనలో ఆ రోగలక్షణాలు కన్పిస్తాయి. నా మాట నమ్ము. నువ్వు ఆరోగ్యంగా ఉన్నావు".

నీకసలు రోగ నిర్ధారణ చేయడం తెలీదు. నువ్వు మా ఫ్యామిలీ డాక్టర్ కావడం నా దురదృష్టం. అయినా క్యాన్సర్ ఉంటే గైనకాలజిస్టువి నీకేం తెలుస్తుంది? క్యాన్సర్ నిపుణుడి దగ్గరకెళ్ళాలి గాని... అనే భావం వచ్చేట్టు చూసింది విస్మిత.

తను చెప్పింది ఆమెకు నచ్చలేదని డాక్టర్‌కర్థమైంది. "అనవసరంగా వేరే హాస్పిటళ్ళకెళ్ళి డబ్బులు నష్టపోకు. మనసుని ప్రశాంతంగా ఉంచుకో.యోగా నేర్చుకో.ధ్యానంచేయి" మందులచీటీని ఆమె చేతికిస్తూ చెప్పింది.

ఆ రాత్రి భర్తతో తన అనుమానం గురించి చెప్పింది. విషయమంతా విన్నాక వినయ్ కూడా కంగారుపడ్డాడు. మరునాడు ఆఫీస్‌కి శెలవుపెట్టి కార్పొరేట్ ఆఫీసులో న్యూరోసర్జన్‌కి చూపించాడు. అతను రాసిన టెస్టులన్నీ చేయించడానికి బోల్డు డబ్బు ఖర్చయింది. ట్యూమర్‌లు ఏమీ లేవు అని నిర్ధారణకు వచ్చేవరకు వాళ్ళిద్దరికి మనశ్శాంతి కూడా కరువైంది.

** ** **

విస్మితకిపుడు నలభైయేళ్ళు. మొహంలో ప్రస్ఫుటంగా కన్పించే భయం... కళ్ళనిండా పూసిన కాటుకలా దిగులు... అరవైయేళ్ళ ముసల్దానిలా ముడతలొచ్చేశాయి. జుట్టు చాలావరకు రాలిపోయింది. రెండేళ్ళ నుంచి డయాబెటిస్‌తో బాధపడుతోంది. గుండెదడ...ఆయాసం...చిన్న శబ్దానికే ఉలికిపాటు... మతిమరుపు కూడా...

రెండ్రోజులక్రితం ఎడం రొమ్ములో మరలా గడ్డలా తగిలింది. ఎన్నిసార్లు తడిమి చూసుకున్నా ఉండలా తగుల్తూనే ఉంది. మరిచిపోయిన భయం మర్రివూడల్లా మెదళ్ళోకి దిగిపోతూ... క్యాన్సరేమోనన్న అనుమానం.. బలపడి.. నమ్మకంగా మారి...

అయిష్టంగానే డాక్టర్ ప్రసన్న దగ్గరకెళ్ళింది.

ఎప్పటికిమల్లే ఆమెని క్షుణ్ణంగా పరీక్షించాక "ఈ టెస్టులు చేయించుకుని రిపోర్టులు పట్టుకురామ్మా" అని డాక్టరన్నప్పుడు విస్మిత ఆశ్చర్యపోయింది.

"నా పోరు పడలేక నా తృప్తికోసం రాసినట్టున్నారు. మామూలుగా అయితే మీరిలాంటివి రాయరుగా" అంది.

డాక్టర్ ప్రసన్న నవ్వి వూరుకుంది.

రెండ్రోజుల తర్వాత విస్మిత పట్టుకొచ్చిన రిపోర్టులన్నీ చూశాక విషణ్ణ వదనంతో "ఐయాం సారీ విస్మితా. క్యాన్సర్ లక్షణాలు కన్పిస్తున్నాయి" అంది డాక్టర్.

అప్పటివరకూ ఉదాసీనంగాఉన్న విస్మితమొహం ఒక్కసారిగా విప్పారింది. 'నేనెప్పటినుంచో చెప్తున్నాను కదా డాక్టర్! మీరే నమ్మలేదు. ఇప్పటికైనా నమ్ముతారా నాది ఉత్త భయం కాదని... నిజమని".

●